క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

తెనాలిరూరల్: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం పట్టణంలోని చినరావూరు, రామలింగేశ్వరపేట ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ సీహెచ్ దుర్గారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

క్రికెట్ జట్టుకు ఎంపికైన క్రీడాకారుడికి అభినందన



తెనాలి: ఇండో–నేపాల్ టీ–20 క్రికెట్ ఫెడరేషన్ సిరీస్‌కు భారత జట్టుకు ఎంపికైన తెనాలి యువకుడు ఎం.చేతన్‌దత్త యాదవ్‌ను శుక్రవారం సాయంత్రం తట్టుకూళ్ల అశోక్ యాదవ్ కార్యాలయంలో యాదవ సంఘీయులు సత్కరించారు. నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. స్వయంకృషితో క్రికెట్ సాధన చేసిన చేతన్ దత్త యాదవ్, భారత జట్టుకు ఎంపికవటం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరింతగా రాణించి, భారత అధికారిక జట్టుకు ఎంపిక కావాలన్న ఆకాంక్షను వ్యక్తం చేశారు. ప్రముఖ న్యాయవాది తాడిబోయిన శ్రీనివాసరావు, దొడ్డక ఆదినారాయణ, గుమ్మడి వెంకటనారాయణ, చెన్నుబోయిన శ్రీనివాసరావు, మునగా నరసింహారావు, పిట్టు వెంకట కోటేశ్వరరావు, ఆరాధ్యుల కన్నా, తాడిబోయిన కృష్ణ, తట్టుకూళ్ల తేజ యాదవ్, మద్దిబోయిన ఫణి, తుల్లిమిల్లి చంటి తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి దోమలే ప్రథమ శత్రువులు



తెనాలిఅర్బన్: ప్రజారోగ్యానికి దోమలు ప్రథమ శత్రువులని మున్సిపల్ ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల పేర్కొన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నాజర్‌పేటలో శుక్రవారం వ్యాధులపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న దోమ పెను ప్రమాదానికి కారణమన్నారు. దోమల వ్యాప్తి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో, పాత వస్తువుల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. తెనాలి సహాయ మలేరియా అధికారి చిరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దోమలు కుట్టడం వలన అనేక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందన్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బీబీజాన్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాల చంద్రమౌళి, మలేరియా అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, జి.రవికుమార్, లక్ష్మి, రషీద్, రత్నాకరరావు పాల్గొన్నారు.

అమ్మవారికి గాజులతో శ్రావణ శోభ



తెనాలి: శ్రావణ శుక్రవారం సందర్భంగా రూరల్ మండలం కఠెవరంలోని శ్రీదుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కనకదుర్గాదేవి అమ్మవారికి గాజులతో అలంకరణ చేశారు. ఆలయ ధర్మకర్త జాజుల వెంకటేశ్వరరావు, పూజారి మణికంఠ పర్యవేక్షించారు.

యాజమాన్యాన్ని కఠినంగా శిక్షించాలి

తెనాలి: అచ్యుతాపురం సెజ్ ఫార్మా కంపెనీ పేలుడు ఘటనలో మరణించిన, గాయపడిన కార్మికులకు యాజమాన్యాలచే భారీపరిహారం చెల్లింపజేయాలని రైతుకూలీ సంఘం (ఆంధ్రప్రదేశ్) రాష్ట్ర కార్యవర్గసభ్యుడు బొల్లిముంత సాంబశివరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనకు బాధ్యులైన పరిశ్రమ యజమానులను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, రాష్ట్రంలోని పరిశ్రమలన్నింటిలో కార్మికుల భద్రతకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

ఇంటింటి ఓటరు సర్వే పరిశీలన

తెనాలిరూరల్: నియోజకవర్గంలో జరుగుతున్న ఓటరు జాబితా ఇంటింటి సర్వేను తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ శుక్రవారం పరిశీలించారు. మండల గ్రామం అంగలకుదురు, పట్టణ సుల్తానాబాద్‌లలో జరుగుతున్న సర్వేను స్వయంగా వెళ్లి పరిశీలించారు. ఓటరు జాబితాలో కన్నెగంటి పెదపాములయ్య వయసు 100 అని ఉండడంతో తహసీల్దార్ జాబితాలోని వివరాల ప్రకారం ఆ ఇంటికి వెళ్లి నూర్లేళ్ల ఓటరును పలకరించి వివరాలు నమోదు చేయించారు. అభ్యంతరాలను డిసెంబరు 24లోగా పరిష్కరించాల్సి ఉంటుందని ఇందుకోసం సర్వేను సమగ్రంగా పక్కాగా చేయాలని సిబ్బందిని ఆదేశించినట్టు వెల్లడించారు. రాజకీయ పార్టీలు బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకుని సర్వేలో భాగస్వాములు చేయాలని కోరారు.

భయమేస్తోంది..



కోల్‌కతాలో చోటుచేసుకున్న ఘటనతో భయమేస్తోంది. వెలుగులోకి వస్తున్న నిజాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పుడు ఇప్పుడే విద్యార్థినులు ధైర్యంగా ముందుకు వచ్చి పీజీ చదువుకుంటున్నారు. ఇలాంటి ఘటనలతో మళ్లీ ఇళ్లకే పరిమితమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. ప్రభుత్వాలు నిందితుడితో పాటు కారణమైన ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలి. విద్యార్థినులు, వారి తల్లిదండ్రులలో ధైర్యం నింపాలి.

–లిఖిత, వైద్య విద్యార్థిని



కఠిన చట్టాలు తేవాలి



తల్లిదండ్రులకు దూరంగా ఉండి కష్టపడి వైద్యవిద్య చదువుకుంటున్నాం. ఇలాంటి ఘటనలు ఎంతో ఆందోళన కలిగిస్తున్నాయి. సమాజానికి వైద్య సేవలందించాలని ఆశయంతో చేరాం. దేశానికి మా వంతు సేవలందించాలని ఆకాంక్ష. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి.

– దేవిరెడ్డి మాధురి, వైద్య విద్యార్థిని

శిథిలావస్థలో మునిసిపల్ భవనం

- పెచ్చులూడుతున్న శ్లాబ్
- భయం భయంగా జీవిస్తున్న ఉద్యోగులు
- రూ.15 కోట్లతో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు
- ఉన్నతాధికారుల అనుమతుల కోసం ఎదురు చూపులు

దాదాపుగా అయిదు దశాబ్దాలకు పైగా సేవలందించిన మునిసిపల్ కార్యాలయ భవనం నేడు శిథిలావస్థకు దగ్గరైంది. దాదాపుగా 58 సంవత్సరాలపాటు పరిపాలన పరమైన అంశాలకు వేదికగా నిలిచిన ఈ భవన సముదాయం నేడు శ్లాబ్ పెచ్చులూడిపడుతూ అక్కడ పనిచేస్తున్న ఉద్యోగవర్గాల్లో వణుకు పుట్టిస్తోంది. నూతన భవన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపి చాలాకాలం అయినా ఇంకా ఉన్నతాధికారుల అనుమతి రాకపోవడంతో శిథిలమైన ఈభవనంలో కార్యకలాపాలు నిర్వహించాల్సిన పరిస్థితి ఉద్యోగులకు ఎదురవుతోంది.

తెనాలిఅర్బన్: పట్టణ పురపాలక సంఘ భవనం శిథిలావస్థకు చేరింది. ఈ కార్యాలయం 16 మే 1966లో నిర్మించారు. దీనిని అప్పటి ముఖ్యమంత్రి కె.బ్రహ్మానంద రెడ్డి ప్రారంభించారు. ఆ సమయంలో ప్రధాన రహదారి వైపు షాపులు నిర్మించారు. మిగిలిన భాగంతో పాటు మొదటి, రెండవ అంతస్తులో పురపాలక సంఘ పరిధిలోని వివిధ విభాగాలను ఏర్పాటు చేశారు. భవనం ఇరుకుగా ఉండటంతో దానిలోని వెనుక వైపు 2006లో మొదటి అంతస్తులో కౌన్సిల్ హాల్‌ను, గ్రౌండ్ ఫ్లోర్‌లో మెప్మా, హెల్త్ సెక్షన్ భవనాన్ని నిర్మించారు. అలాగే మెప్మా షెడ్‌ను కూడా నిర్మించారు.


58 సంవత్సరాలు సేవలు

తెనాలి పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్‌ల చాంబర్‌లతో పాటు రెవెన్యూ, అకౌంట్, ఆడిట్ సెక్షన్‌లు, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, పబ్లిక్ హెల్త్, మెప్మా, హెల్త్ విభాగాలు ఉంటాయి. వీటిలో శాశ్వత ఉద్యోగులు 229 మంది, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు 480 మంది పనిచేస్తుంటా రు. వీరు కాకుండా ప్రతిరోజు సుమారు 250 మంది వరకు వివిధ పనులపై పట్టణ వాసులు కార్యాలయానికి వస్తుంటారు. అయితే కార్యాలయంలో శిథిలమవ్వడం.. శ్లాబ్‌లు పెచ్చులూడటం రెండేళ్ల నుంచి ప్రారంభమైంది. కింద భాగంలో పెచ్చులూడి ఇనుప చువ్వలు కన్పిస్తున్నాయి. అలాగే మొదటి అంతస్తులోని కమిషనర్ చాంబర్‌లోని శ్లాబ్ ఇటీవల పెచ్చులూడి కింద పడింది. అలాగే కమిషనర్ చాంబర్‌కు ముందు ఉన్న భాగం కూడా పూర్తిగా శ్లాబ్ ఊడిపోయి ఇనుపచువ్వలు కన్పిస్తున్నాయి. అలాగే రెండవ అంతస్తులోని టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ విభాగాల సమీపంలో కూడా ఇదే విధంగా శ్లాబ్ తయారైంది. అయితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అనే ఆందోళన ఉద్యోగులలో నెలకొని ఉంది.





పెచ్చులూడిన గ్రౌండ్ ఫ్లోర్



కమిషనర్ చాంబర్‌లో శ్లాబ్ పెచ్చులూడటంతో సీలింగ్‌కు పడిన రంధ్రం

రూ.15 కోట్లతో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు

తెనాలి పురపాలక సంఘం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో దానిని నిర్మించాలని అధికారులు భావించి ప్రతిపాదనలు గతంలో సిద్ధం చేశారు. భవనాన్ని పూర్తిగా పడగొట్టి దానిలో సెల్లార్‌తో పాటు నాలుగు అంతస్తులు నిర్మించాలనే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్న సమయంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి తెనాలిలో పర్యటించిన సందర్భంలో నూతన భవనానికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతులకు పంపారు. ఈలోపు ఎన్నికలు రావటంతో ఆ ప్రక్రియ పూర్తిగా నిలచిపోయింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాల మేరకు మళ్లీ మున్సిపల్ అధికారులు డిజైన్‌లలో కొన్ని మార్పులు చేసి రూ.15 కోట్లతో అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దానిని ఉన్నతాధికారులు ఆమోదించి నిధులు విడుదల చేయాల్సి ఉంది. అలాగే మున్సిపల్ కార్యాలయాన్ని తాత్కాలికంగా మున్సిపల్ మార్కెట్ భవనంలోకి మార్పు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నా రు. ఈనెల చివర్లో జరిగే మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో దానికి సంబంధించిన అంశాన్ని అజెండాలో పొందుపరిచే ఆలోచనలో యంత్రాంగం ఉంది. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

> **ఎప్పుడు ఎవరిపై శ్లాబ్ పెచ్చులు ఊడి పడతాయో అనే ఆందోళన ఉద్యోగులలో నెలకొంది. కొన్నిసార్లు శ్లాబ్ పెచ్చులూ అధికారుల సమీపంలో ఊడి పడుతుంటంతో భయం భయంగా బ్రతుకు జీవుడా అంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారు. మున్సిపల్ కార్యాలయ అధిపతిగా భావించే కమిషనర్ చాంబర్‌లోనే ఇటీవల పెచ్చు ఊడి పడిందంటే దీని తీవ్రత ఏ మేరకు ఉందో మనకు అర్థమవుతుంది.**

త్వరలో నూతన భవనం నిర్మించేందుకు చర్యలు



పురపాలక సంఘ భవనం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవం. శ్లాబ్‌లు పెచ్చులు ఊడుతుండటంతో ఉద్యోగులు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఆందోళన చెందుతున్నారు. దీని స్థానంలో నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారుల అనుమతుల కోసం పంపాం. త్వరలో అనుమతులు వచ్చే అవకాశం ఉంది. అవి రాగానే దీనిని పడగొట్టి నూతన భవనానికి శంకుస్థాపన చేస్తాం.

–బండి శేషన్న, కమిషనర్

మంచినీటి సరఫరాలో లోపాలు రానివ్వకండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



తెనాలిఅర్బన్: పట్టణంలో రక్షిత మంచినీటి పథకం కింద అందిస్తున్న నీటి సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. 17వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అలాగే వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటి శాంపిల్స్‌ను సేకరించాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

అభ్యుదయ రైతు సుదర్శన బాబుకు ఘననివాళి

తెనాలి: పట్టణానికి చెందిన అభ్యుదయ రైతు, వ్యాసరచయిత, పుస్తక ప్రచురణకర్త కొడాలి సుదర్శనబాబు (68)కు శుక్రవారం వివిధ రంగాల ప్రముఖులు నివాళులర్పించారు. అనారోగ్యంతో గురువారం హైదరాబాద్‌లో మృతిచెందిన సుదర్శనబాబు భౌతికకాయాన్ని అదేరోజు రాత్రి తెనాలికి తరలించారు. స్థానిక సుల్తానాబాద్ అలపాటి నగర్‌లోని నివాసంలో ఉంచిన సుదర్శనబాబు భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం వివిధ రంగాల ప్రముఖులు, సన్నిహితులు సందర్శించారు. పుష్పాంజలి ఘటించారు. 10.30 గంటల ప్రాంతంలో అంతిమ యాత్ర నిర్వహించి, పాండురంగపేటలోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తిచేశారు. నివాళులు అర్పించినవారిలో జనసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు, ప్రముఖ రచయిత/పరిశోధకుడు ముత్తేవి రవీంద్రనాథ్, డాక్టర్ కొమ్మినేని రమేష్‌బాబు, డాక్టర్ జగదీశ్వరి, యడ్లపాటి రఘురాం, శాఖమూరి తిమ్మనాయుడు, చిట్టినేని సాంబశివరావు, ఆలపాటి వెంకట్రామయ్య, డాక్టర్ పాలడుగు తదితరులున్నారు.

ప్రకాశం పంతులు చేసిన సేవలు మరువరానివి



మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్ రాధిక, కమిషనర్ శేషన్న



పెన్షనర్ల హాలులో టంగుటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీనియర్ సిటిజన్స్

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధికి టంగుటూరి ప్రకాశం పంతులు ఎన్నలేని సేవలు చేశారని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. ప్రకాశం పంతులు జయంతిని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమంలో ఆయన చూపిన తెగువ మరువరానిదన్నారు. ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా విశేష సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో కమిషనర్ బండి శేషన్న, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, మేనేజర్ అప్పలరాజు, ఏసీపీ సుబ్బారావు, మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

- ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతిని పెన్షనర్స్ హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాశం పంతులు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సాగర్, సూర్యప్రకాశరావు, హృదరాజు, సోమయ్యశాస్త్రి, అజ్గర్ ఆలీ, లక్ష్మణరావు, రవి, ఎం.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
- ప్రకాశం పంతులు జయంతిని పురస్కరించుకుని చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రావి చిన వెంకటేశ్వర్లు, ఈవో ఎం.రమణరావు, కార్యాలయ సూపరింటెండెంట్ ఎ.శ్యామ్‌సుందర్, అబ్బాస్ బాషా, తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్ చిన్న వెంకటేశ్వర్లు



నివాళులర్పిస్తున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, సిబ్బంది

తెనాలిరూరల్: ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని పుస్కరించుకుని తహసీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ మాట్లాడుతూ విలక్షణ రాజకీయంతో, విప్లవాత్మకమైన సంస్కరణలతో మొట్టమొదటి ముఖ్యమంత్రిగా మన రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం చిత్తశుద్ధితో కృషి చేసిన మహనీయుడు టంగుటూరి ప్రకాశం పంతులు అని కొనియాడారు. ఆర్ఐ జాన్, టీడీలు, సిబ్బంది పాల్గొన్నారు.

చిట్టి చేతులు - పెద్ద మనసులు!



కేరళలోని వయనాడ్ జిల్లాలో సంభవించిన వరద బీభత్సానికి నిరాశ్రయులైన ప్రజల సహాయార్థం స్థానిక ఎన్‌సీఆర్ మున్సిపల్ ఉన్నతపాఠశాల విద్యార్థులు రూ.17,671 విరాళం అందజేశారు. తమ ప్యాకెట్‌మనీతోపాటు పట్టణంలో అవగాహన ర్యాలీతో సేకరించిన మొత్తాన్ని కలిపి ఈ విరాళాన్ని శుక్రవారం గుంటూరులో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మికి ఎన్‌సీసీ అధికారి/హిందీ ఉపాధ్యాయుడు పులి భాస్కరరావుచే అందజేశారు. విద్యార్థినీ విద్యార్థుల వితరణను జిల్లా కలెక్టర్ అభినందించారు.

- తెనాలిఅర్బన్

గ్రామాభివృద్ధికి అధికారులు కృషి చేయాలి

- మంత్రి నాదెండ్ల మనోహర్
- వేర్వేరు గ్రామాల్లో గ్రామ సభలు



వల్లభాపురం గ్రామ సభలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్



మాట్లాడుతున్న జెడ్పీ డిప్యూటీ సీఈవో మోహనరావు

వల్లభాపురం(కొల్లిపర): గ్రామస్థాయిలో గ్రామసభలు నిర్వహించి పార్టీలకు అతీతంగా క్షేత్రస్థాయిలో అధికారులు సమస్యలు తెలుసుకుని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎటువంటి అవినీతి లేకుండా పనిచేసినప్పుడే బాబుజీ కలలు కన్న గ్రామ అభివృద్ధితో పాటు దేశ ప్రగతి సాధించటం జరుగుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెందిన నూతన ఉపాధి పనులు గుర్తించి, వాటి మంజూరు కోసం నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, తెనాలి సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్‌లతో కలసి ముఖ్యఅతిథిగా మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామ సభలో అనేక మంది తన దృష్టికి రోడ్లు, డ్రైనేజీ సమస్యలు గురించి వివరించారని తప్పకుండా వాటి పరిష్కారానికి కృషి చేస్తాని తెలిపారు. ఉపాధి హామీ పనులలో ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనులు జరగకుండా, గతంలో చేసిన వాటిని మళ్లీ పనులు చేసినట్లు లెక్కలు చూపిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే అటు వంటి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని హెచ్చరించారు. కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ గ్రామంలో ఎప్పుడు గ్రామ సభలు జరిగినా ప్రజలు పాల్గొన్ని గ్రామంలో ప్రధాన సమస్యలు అధికారుల దృష్టికి తీసుకువచ్చి ఆ సమస్యలు పరిష్కరించు కోవాలని సూచించారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా గ్రామంలో ఎటువంటి పనులు చేయాలని అన్న అంశాలను ప్రతి ఒక్కరు తెలుసుకుని ఉండాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లు ద్వారా పంచాయతీ వారు ఇంటికి వెళ్లి తడి, పొడి చెత్త తీసుకురావటం దాని ద్వారా వర్మి కంపోస్టు ఎరువులు తయారు చేయటం జరుగుతుందన్నారు. సభ అనంతరం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఉమామహేశ్వరి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ వల్లభాపురం నిర్మల, ఉపసర్పంచ్ అవుతు పోతిరెడ్డి, వంగా సాంబిరెడ్డి, ఎంపీడీవో విజయలక్ష్మి, తహసీల్దార్ సిద్ధార్థ, మండల టెక్నికల్ అసిస్టెంట్ అజయ్‌బాబు, సీఐ బెల్లంకొండ శ్రీనివాసరావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో గ్రామ సభలు

తెనాలిరూరల్: మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంపై మండల గ్రామాల్లో గ్రామ సభలను శుక్రవారం నిర్వహించారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో సర్పంచ్ బండికళ్ల ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో జెడ్పీ డిప్యూటీ సీఈవో జె. మోహనరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్పెషల్ ఆఫీసర్ సీహెచ్ హిమబిందు, ఎంపీడీవో కె.ప్రభాకరరావు, పంచాయతీ కార్యదర్శి సయ్యద్ గౌస్ మొహిద్దీన్, వార్డు సభ్యులు, టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు. మండలంలోని కొలకలూరు గ్రామంలో జరిగిన గ్రామ సభలో మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు. పెదరావూరులో జరిగిన గ్రామ సభకు సర్పంచ్ కాకి రమాదేవి అధ్యక్షత వహించారు. డీఎల్‌పీవో సంధ్యారాణి, రామసుబ్బారావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ నిధులతో గ్రామాల అభివృద్ధి

తెనాలి: మన పంచాయతీ–మన సాధికారత పేరుతో ప్రభుత్వం చేపట్టిన గ్రామసభల్లో భాగంగా శుక్రవారం రూరల్ మండల గ్రామం కొలకలూరులో గ్రామసభను నిర్వహించారు. టీడీపీకి చెందిన మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంతో గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని, అన్నిరంగాల్లోని వారికి ఉపాధి కూడా లభిస్తుందని చెప్పారు. గ్రామ సర్పంచ్ చొప్పర ప్రీతి, కార్యనిర్వహణాధికారి రామసుబ్బారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆలపాటి

ఏ హోదాలో సభలో పాల్గొంటారు?:

ఇదిలా ఉంటే, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఏ హోదాలో గ్రామసభలో పాల్గొనేందుకు వస్తున్నారని కొలకలూరు ఎంపీటీసీ–1, ఎంపీటీసీ–2 కాలిశెట్టి ఫణికుమార్, దోసపాటి నాగదేవిక అధికారులను ప్రశ్నించారు. అధికారిక కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆయనకున్న హోదా ఏమిటి? ఎందుకు అనుమతిస్తున్నారు? చట్టబద్ధత ఏమిటి? అని ప్రశ్నించారు. అధికారుల నుంచి సమాధానం రాకపోవటంతో సభను బహిష్కరించారు.

ఎయిడ్స్‌పై అప్రమత్తంగా ఉండండి



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపల్ చిన్న వెంకటేశ్వర్లు

తెనాలిఅర్బన్: ఎయిడ్స్ వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని తెనాలి ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రావి చిన్న వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఎయిడ్స్ కంట్రోలు సొసైటీ ఆదేశాల మేరకు సిరి మహిళా సాధికారిత వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో చినరావూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్‌కు మందు లేదని, నివారణ ఒకటే మార్గమన్నారు. అనంతరం ఎయిడ్స్ నియంత్రణకు సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిరి మహిళా సంస్థ ప్రాజెక్టు మేనేజర్ ఎ.రాజు, ఎం.శివశంకర్, కమల్, లక్ష్మి, మహాలక్ష్మి పాల్గొన్నారు.